ఆంధ్రజ్యోతి

# నవీన

27.05.2000

# మహిళలకు వెలుగు చూపిన కందుకూరి

" నాకు స్త్రీ విద్యయందును, స్త్రీల అభివృద్ధి యందును విశేషాభిమానము. స్త్రీలను ప్రస్తుత పరిస్థితిలోనే యుంచి, తాము పైకి లేచుట పురుషులకెన్నడును సాధ్యము కాదనియు, తాము బాగుపడవలెనన్నచో వారిని కూడా మంచి స్థితిలోనికి తీసుకువచ్చి వారితో కలసి ఉన్నత పదవికి లేవవలయుననియు నేను తలంచుచుండెడి వాడిని.'' ఈ మాటలు ప్రముఖ సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులివి. దక్షిణ భారత విద్యాసాగరుడిగా పేరొందిన కందుకూరి జీవితాంతం స్త్రీ జనోద్ధరణకు కృషి చేశారు. పురుషులతో మహిళలు సమాన స్థాయికెదగాలని, వారు అభివృద్ధి చెందేలా చైతన్యయుత పాత్ర పోషించాల్సిన అవసరం పురుషులదేనని ఆయన ఆనాడే ఎలుగెత్తి చాటారు.

ఆనాటి సమాజంలో స్త్రీల పరిస్థితి మరీ దయనీయం. విద్యాగంధం వారికి నిషిద్ధం. సంఘ దుర్నీతికి, దురాచారాలకు స్త్రీలు బలైపోయిన కాలమిది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆనాటి మహిళలను పశువుల కన్నా, బానిసల కన్నా హీనాతిహీనంగా చూసేవారు. బాల్యవివాహాలు, నిర్బంధవైధవ్యం, వరశుల్క విధానం, చాదస్తపు సంప్రదాయాలు కలగలసి స్త్రీలను మనుషులుగా గుర్తించ నిరాకరించిన సమాజంలో మహిళా అభ్యున్నతి కోసం జీవితాన్ని ధారపోసిన వాడు వీరేశలింగం పంతులు.

> స్త్రీ విద్యపట్ల వీరేశలింగం పంతులుకు విశేషమైన అభిమానం. 'చంద్రమతీ చరిత్రం' అన్న పెద్ద కథలో కూడా స్త్రీలు నేర్చవల్సిన విషయాలను చంద్రమతి తన గురువు వద్ద నుంచి తెలుసుకున్నట్టు రాస్తారు వీరేశలింగం పంతులు. స్త్రీ విద్యను సమర్థిస్తూ 'పురుషార్థప్రదాయిని' పత్రికలోనూ, కొక్కొండవారి 'ఆంధ్రభాషా సంజీని' (1872) లోనూ జరిగిన వాదప్రతివాదనలలో పాల్గొన్నారాయన.

అనేక దురాచారాల ఉక్కు కౌగిలిలో సమస్త స్త్రీ జాతి నలిగిపోతున్న కాలంలో స్త్రీలను చైతన్యపరిచే కర్తవ్యాన్ని భుజానకెత్తుకున్నారాయన.

కేవలం రచనలతోనే సరిపుచ్చుకునే మనస్తత్వం కాదాయనిది. మాటలలో అభ్యుదయాన్ని వల్లించి ఊరుకోలేదు. స్వయంగా ఆచరించి చూపారు. 1874లోనే ధవళేశ్వరంలో మొట్టమొదటగా బాలికల కోసం పాఠశాల స్థాపించారు. వితంతు వివాహాల విషయంలోనే ఆయన పోషించిన పాత్ర ఆదర్శప్రాయమైనది. 1881 జనాభా లెక్కల ప్రకారం, మన దేశం మొత్తం జనాభా 17 కోట్లు. ఇందులో 25 ఏళ్ళ లోపు వితంతువులు 12 లక్షలు మంది. 15 ఏళ్ళ లోపు వితంతువులు ఒక లక్షా 74వేలు. పదేళ్ళ లోపు వయస్సు వితంతువులు 63వేల మంది. ఈ లెక్కలు చాలు ఆనాటి కాలంలో స్త్రీల పరిస్థితి ఎంత దయనీయంగా ఉండేదో అర్థం చేసుకోవడానికి. ముక్కుపచ్చలారని పసిప్రాయంలోనే స్త్రీలను వృద్ధులకు కట్టబెడుతున్న ఫలితంగా ఊహ రాక ముందే వితంతవులుగా మారాల్సిన పరిస్థితులకు తీవ్రంగా చలించిపోయారాయన. స్త్రీల దయనీయ పరిస్థితులను చూసి ఆవేదన చెందడానికే ఆయన పరిమితం కాలేదు. వితంతు పునర్వివాహం శాస్త్ర సమ్మతమేనని 1879 ఆగస్టులోనే వాదించారు. అంతేకాదు, 1881 డిసెంబర్ 11న మొట్టమొదటి వితంతు వివాహాన్ని రాజమహేంద్రవరంలో జరిపించారు. బాలవితంతువుల దుస్థితికి గర్హిస్తూ, '' కడుపున బుట్టిన కన్న తల్లిదండ్రులకైన నా ముగ్ధ బాలికలయందు కరుణ పుట్టి, వారికి పునర్వివాహము చేసి సుఖపెట్టవలెనన్న బుద్ధి జనించగూడదా? నిన్న మొన్నటి వరకు నెంతో ప్రేమతో బెంచి, ప్రాణములనెల్లను వారిపైనే బెట్టుకొనియుండి, భర్త పోయినాడన్న పాడు వార్త విన్న మాత్రమున, సమస్తాలంకారములను దీసివేసి విరూపిని జేసి ముసుగు వేసి మూలన కూరుచుండబెట్టి, చచ్చియు, చావకుండగను...'' అని స్త్రీ పునర్వివాహ శాస్త్ర సంగ్రహము, స్త్రీ పునర్వివాహ విషయకోపన్యాసము, స్త్రీ పునర్వివాహ విషయక ప్రథమ విజ్ఞాపనము మున్నగు రచనలలో వీరేశలింగం పంతులు రాశారు. ఈ రచనలన్నింటిలోనూ స్త్రీ విద్య, స్త్రీ స్వాతంత్ర్యాల ఆవశ్యకతను ఆయన ఎలుగెత్తి చాటారు. స్త్రీ విద్యా వ్యాప్తికి ఆయన చేస్తున్న కృషికి అడుగడుగునా అవాంతరాలు, ఎక్కిరింపులు ఎదురౌతున్నా ఏనాడూ వెనకడుగు వేయలేదాయన. స్త్రీల సమస్యల పట్ల, స్వాతంత్ర్యం పట్ల వీరేశలింగం చేసిన కృషి ఆ కాలంలో ఏ రచయితా చేయలేదనేది నిర్వివాదాంశం.

వీరేశలింగం 1884లో రాసిన ' చంద్రమతి చరిత్ర ', 1887లో రాసిన 'సత్యసంజీవిని', 1891లో రచించిన 'సత్యరాజా పూర్వదేశయాత్రలు', 1897లో రాసిన 'విక్టోరియా మహారాణి గారి చరిత్ర', 1889లో రచించిన దేహారోగ్యబోధిని, స్త్రీ నీతి దీపిక, సత్యాద్రౌపదీ సంవాదము, మాతృపూజ తదితర రచనలన్నీ స్త్రీల చైతన్యాన్ని కాంక్షిస్తూ సాగినవే. తెలుగు నవలా ప్రక్రియలోనే ప్రప్రథమమైన 'రాజశేఖర చరిత్ర' ను రచించినదీ వీరేశలింగం పంతులే. ఇందులో వ్యక్తిగత జీవితాలకు ప్రాధాన్యత నివ్వకుండా, సమాజంలో వారి నైతిక ప్రవర్తనకు, సాంఘికానువర్తనకు ప్రాముఖ్యతనిచ్చి, ఆనాటి సమాజంలో ముఖ్యంగా కుటుంబంలో స్త్రీలు ఎదుర్కొంటున్న దైన్యావను క్లుప్తంగానైనా కళ్ళకు కట్టారు. ఆయన సృష్టించిన 'నీలాటి రేవు' సన్నివేశం అత్యంత సహజంగా కనిపిస్తుంది. నాటి సంప్రదాయానుగతమైన కుటుంబంలో స్త్రీల అణచివేత విధానాన్ని మన కళ్ళ ముందు సాక్షాత్కారింపజేస్తుంది. ఈ నవలలో ఆయన స్త్రీల సమస్యలను చర్చించిన తీరు, పరిష్కారాలను సూచించిన పద్ధతి ఆయనలోని పరిణతికి దర్పణం పడతాయి. ఉమ్మడి కుటుంబంలో కోడంత్రికం పేరుతో అత్తలు, ఆడపడుచులు, అమాయకురాలైన శేషమ్మను ఇంటి చాకిరీతో కుంగదీయడం, కొట్టి తిట్టి ఆరళ్ళు పెట్టడాన్ని '' జాముతెల్లవారలేచి, మడిబట్టలుతికి, ఇంటి ప్రాచియంతయుజేసి, అంట్లుతోమి, ఇంటికి కావల్సిన నీళ్ళన్నియూ తోడి, ఆమె లేచువరకు పనులన్నియు జేయుచుందును. అప్పుడు నాలుగు గడియల పొద్దెక్కి లేచి, గరిటికంటు వదల లేదని, వాకిటిలో బెంట యట్టే యున్నదనీ, తిట్టిపోయును. తరువాత, పేడజేసి గోడమీద పిడకలు చరిచి, రెక్కలు విరుచుకొన్న'' కోడలికి రాత్రి మిగిలిన చద్దనం పెట్టడానికి ఎన్నో తిట్లు, దీవెనలు చదువుతుంది అత్తగారు. ఆడబడుచు బతికి ఉండగా తనకు తిండి కూడా సరిగ్గా ఉండేది కాదనీ, '' నిరుడు అమ్మవారి జాడ్యముతో'' ఆవిడ చనిపోయిన దగ్గరనుంచి 'తిన్నగా అన్నమునైన దినుచున్నాను' అని వాపోయిన శేషమ్మ మాటలు చదివితే ఆనాటి సమాజంలో స్త్రీల దీనస్థితిపట్ల జాలికలుగుతుంది. అత్తల రాక్షసత్వం ఆనాటి కుటుంబంలో సహజం. రాత్రీ, పగలు చాకిరితో డస్సిపోయి, సరైన తిండిలేక, జబ్బు చేస్తే నాటుమందులు తప్ప వేరే దిక్కులేక, ఆరోగ్య విషయంలో పరిజ్ఞానం లేక అకాలంలో మరణించే స్త్రీల సంఖ్య ఎక్కువగా ఉండేది. స్త్రీలు చాదస్తపు ఆచారాలతో సమయాన్ని వృథా చేయడం, ఆరోగ్యం చెడగొట్టుకోవడం మొదలైన విషయాలను వీరేశలింగంపంతులు నిశితంగా విమర్శించారు తన రచనలలో. నీలాటి రేవులో ఆయన వర్ణించిన స్త్రీ ముచ్చట్లలో పేరమ్మ మాటలలో భోగంవాళ్ళను ఉంచుకోవడం హోదాకు చిహ్నమైన అప్పటి సాంఘిక పరిస్థితినీ, బంగారమ్మ మొగుడు వేశ్యాసాంగత్యాన్ని మరగి భార్యను బాధపెట్టడంలోని పురుషాధిక్య స్థితిని విశ్లేషిస్తారు. స్త్రీ విద్యావశ్యకతను, దానివల్ల స్త్రీలకు కలిగే ప్రయోజనాలకు రుక్మిణీ పాత్ర ద్వారా నిరూపిస్తారు. అడవిలో ఒంటరిగా చనిపోయిందనుకొని వదిలివేయబడ్డ రుక్మిణీ ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని తల్లితండ్రులను చేరుకున్న వైనాన్ని వివరిస్తూ , రుక్మిణికి ఆ సాహసాన్ని కలుగజేసినది తండ్రి రాజశేఖరుడు చెప్పించిన చదువేనని స్పష్టీకరిస్తారు వీరేశలింగంపంతులు. '' అయ్యగారి రామమ్మకేమి గర్వమో గానీ, మనుషులతో మాటాడనే మాటాడదే''. '' కరణము పెండ్లామింత యొయ్యారముగా నడుచునే చూచినావా?'' '' పుల్లమ్మ పట్ట పగలే మగనితో మాటాడునట''... ఇటువంటి వృథా ముచ్చట్లతో పొద్దుపుచ్చే స్త్రీలను చూసి విసిగి పోయిన వీరేశలింగం పంతులు ''విద్యాగంధము నెఱుగని మూఢవనితలకు మాటాడుకొనుటకింత కన్నా మంచి విషయములేమి దొరుకును?' అని ఈసడించుకొంటారు.'' విద్య లేకపోవడం వల్లనే స్త్రీలు అటువంటి చచ్చుపుచ్చు కబుర్లు చెబుతున్నారు'' అన్న పంతులుగారు ఈనాడు చదువుకొని, ఉద్యోగాలు చేసే మహిళలు బస్టాప్‌లలో, పార్టీలలోనూ, ఆఫీసులలో లంచ్ రూములలో సాగించే సంభాషణ వింటే ఏమంటారో!?

## స్మృతి

స్త్రీ విద్యపట్ల వీరేశలింగం పంతులుకు విశేషమైన అభిమానం. 'చంద్రమతీ చరిత్రం' అన్న పెద్ద కథలో కూడా స్త్రీలు నేర్చవల్సిన విషయాలను చంద్రమతి తన గురువు వద్ద నుంచి తెలుసుకున్నట్టు రాస్తారు వీరేశలింగం పంతులు. స్త్రీ విద్యను సమర్థిస్తూ 'పురుషార్థప్రదాయిని' పత్రికలోనూ, కొక్కొండవారి ' ఆంధ్రభాషా సంజీని' (1872) లోనూ జరిగిన వాదప్రతివాదనలలో పాల్గొన్నారాయన.

వీరేశలింగం రచనలలో మిక్కిలి విశిష్టమైనది 'సత్యవతీ చరిత్ర'. ఈ నవలలో నాలుగు రకాలైన దాంపత్య జీవితాలను చిత్రీకరించారు. స్త్రీ పురుషులిద్దరూ చదువుకొన్నవారు, స్త్రీ విద్యావంతురాలు, పురుషుడు విద్యావిహీనుడు, స్త్రీ,పురుషులిద్దరూ విద్యావిహీనులు, స్త్రీ విద్యావిహీనురాలు, పురుషుడు విద్యావంతుడు అయిన సందర్భాలలో వారివారి దాంపత్యాలలో సంభవించే కష్టనష్టాలు, సుఖదుఖాలు విపులంగా విశదీకరించి, చివరకు విద్యావంతురాలైన స్త్రీలకు సంసారంలో ఎటువంటి ఒడిదుడుకులు ఏర్పడినా ధైర్యంగా ఎదుర్కొని ముందుకు నడవగలదన్న సత్యాన్ని సత్యవతి పాత్ర ద్వారా కళ్ళకు కడతారు. ఈ నవల రాయడంలో ఆయన ప్రధాన ఉద్దేశ్యం స్త్రీ విద్యావశ్యకతను ప్రచారం చేయడం, స్త్రీ స్వాతంత్ర్యావశ్యకతను ఎలుగెత్తి చాటడం. ఈ ప్రబోధాత్మక రచనలో సత్యవతిని విద్యావంతురాలైన, ఆదర్శప్రాయురాలైన స్త్రీ పాత్రగా చిత్రీకరించి, కుటుంబ జీవనాన్ని దిద్దుకోవడానికి ఎటువంటి నడవడిక అవసరమో వివరిస్తారు. వరశుల్కానికీ, బాల్యవివాహ వ్యవస్థకు బలైన సావిత్రి, సీత



పాత్రల ద్వారా బాల్యం లో వైధవ్యం ప్రాప్తించిన స్త్రీల దీనావస్థను కళ్ళెదుట ఆవిష్కరిస్తారు. చదువుకోని సావిత్రి ప్రవర్తననూ, చదువుకొన్న సీత సంస్కారాన్ని చక్కగా, వైవిధ్యభరితంగా చిత్రీకరించారు. ఉమ్మడీ కుటుంబాలలో కోడంత్రికానికీ, స్త్రీల బాధలకూ, ఇంటిచాకిరీకి, తగాదాలకూ పరిష్కారాన్ని సూచిస్తూ, ' అవిభక్త కుటుంబంలో నంత కలహముబుద్భవించి, యైకమత్యము చెడి, సుఖభంగము కల్గినప్పుడు కుటుంబ స్నేహమును మరల నెలకొల్పుటకు వేరు పడుటయే యుత్తమసాధనమ'ని నిర్మొహమాటంగా నొక్కిచెప్పారు.

'' సంఘ దురాచార నివారణమునకు స్త్రీ విద్య యత్యావశ్యకమ''ని (1885 మార్చి, వివేకవర్ధిని) వక్కాణించిన వీరేశలింగం పంతులు ఆనాటి కాలంలో ప్రసవానంతరం స్త్రీలను గాలిచొరబడని గదులలో ఉంచడం, బాలెంతలకు మూడురోజులు అన్నపానాలివ్వకుండా లంకణాలు పెట్టడం, అతిశుభ్రతతో పెంచవల్సిన శిశువుల పరిశరాలలో పాతచెప్పులు, చీపుర్లు ఉంచి, వాతావరణాన్ని రోగక్రిముల పూరితం చేయడం, పొగలు పెట్టడం, నాటు మందులు వాడడం, ఈ చాదస్తపు ఆచారాల వల్ల ప్రసవానంతరం కొద్దిరోజులలోనే పుట్టిన శిశువునో, ఆహారం లేక, నీరసం తట్టుకోలేక బాలెంతరాలు మృత్యువాత పడడం... ఇలాంటి నాటి సామాజిక, వాస్తవిక పరిస్థితులకు దర్పణం పడుతూ కంటనీరు తెప్పిస్తాయి వీరేశలింగం పంతులు రచనలు. మూఢవిశ్వాసాలను ఖండిస్తూ, దేహారోగ్యధర్మబోధిని, శారీరక శాస్త్ర సంగ్రహం, పత్నీహితసూచని, మొదలైన గ్రంథాలలో శుచి, శుభ్రత, ఆరోగ్యం, ప్రసవ సమయంలో, ప్రసవానంతరం పాటించాల్సిన జాగ్రత్తలను సరళమైన భాషలో స్త్రీలకు అర్థమయ్యే రీతిలో రాశారు.

ఈవిధంగా ఆనాటి సమాజంలో మహిళలు ఎదుర్కొన్న దారుణ సమస్యలను తన రచనలలో వివరించి, పరిష్కార మార్గాలను కూడా సూచించి, చెప్పింది ఆచరించి చూపిన కందుకూరి వీరేశలింగం పంతులు స్త్రీ జాతికి ఎన్నటికీ చిరస్మరణీయులే.

–డాక్టర్ ఎం. కనకదుర్గ

పొట్టిశ్రీరాములు తెలుగుయూనివర్సిటీ

హైదరాబాద్.